ఎస్కీ.. ఎవర్ గ్రీన్

ఈ ఏడాది ఒకేసారి 4 ఐఎస్ఓ సర్టిఫికెట్లు, గ్రీన్ అవార్డు

అత్యున్నత శిక్షణా కార్యక్రమాలు, ఉన్నత విద్యా కోర్సుల నిర్వహణలో గచ్చిబౌలి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. 'ఎస్కీ' చరిత్రలో 2024 సంవత్సరం అతి ముఖ్యమైన సంవత్సరంగా చెప్పక తప్పదు. ఈ సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ద్వారా ఏర్పాటు చేయబడిన స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ. ఈ సంస్థ పనితీరు, శిక్షణా కార్యక్రమాలకు గోల్డెన్ పికాక్ అవార్డులు లభించాయి. 1981లో గచ్చిబౌలిలో 70 ఎకరాల స్థలంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాను స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా ఏర్పాటు చేశారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లకు ఏడాది పొడవునా 350కి తగ్గకుండా శిక్షణలు ఇవ్వడమే కాకుండా ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ రంగాలలో రెండేళ్లు, ఏడాది కాలం స్వల్పకాలిక కోర్సులను కూడా అందిస్తోంది.

– రాయదుర్గం

- 2021, 22 ,23, 24లలో వరుసగా అవార్డులు
- 'గోల్డెన్ పికాక్ అవార్డు'తో దేశంలోనే 'ఎస్కీ' రికార్డు
- 'ఎస్కీ'కి ఇప్పటి వరకు 9 గోల్డెన్ పికాక్ అవార్డులు



2024లో సాధించిన ఐఎస్ఓ సర్టిఫికెట్లు, మెమెంటో స్వీకరిస్తున్న ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

◆ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు 2024 సంవత్సరం ఎంతో ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. జూలై 12న హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా ఐఎస్ఓ సర్టిఫికెట్లు ఒకేరోజు నాలుగింటిని పొందడం విశేషం.

◆ పరిపాలనా వ్యవహారాలు, డాక్యుమెంటేషన్ విధానాలు, ఉద్యోగులు తమ విధివిధానాలను పాటించడం, సమయపాలన, ఫైళ్ల సత్వర పరిష్కారం వంటి అద్భుతమైన విధానాలను అమలు చేసినందుకు ఐఎస్ఓ 9001 క్వాలిటీ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్‌ను అందించారు.



◆ ఎస్కీ ప్రాంగణంలో ఉన్న భారీ బండరాళ్లు, భారీ వృక్షాలతో సహజ దనం ఉట్టిపడుతుండగా, గ్రీనరీ పెంపుదలకు ప్రత్యేక కృషి చేయడంతో ఐఎస్ఓ 14001 ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ లభించింది.

◆ ఉద్యోగులు, అధికారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం, తరచూ వైద్య పరీక్షల నిర్వహణ, చైల్డ్ లేబర్ లేకపోవడం, షిఫ్ట్‌ల వారీగా సిబ్బందికి పని వేళలు ఏర్పాటు చేయడంతో ఐఎస్ఓ 45001 ఆక్యుపేషనల్ హెల్త్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

◆ క్యాంపస్‌లో సోలార్ విద్యుత్‌ను వినియోగించడం, కార్యాలయం మొత్తం ఎల్ఈడీ దీపాలు వాడటంతో ఐఎస్ఓ 50001 ఎనర్జీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ కూడా అందించారు.

గ్రీన్ అండ్ ఎన్విరాన్‌మెంట్–2024 అవార్డు

◆ ప్రభుత్వం ఆశించే అన్ని రకాల స్థాయిలను 'ఎస్కీ 8 పాటిస్తున్నందున నగరానికి చెందిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గ్రీన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అవార్డు–2024'ను కూడా అందుకుంది.



గ్రీన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అవార్డు సర్టిఫికెట్





ఎస్కీ 2024లో సాధించిన ఐఎస్ఓ సర్టిఫికెట్లు

'గోల్డెన్ పికాక్ అవార్డు'.. గత నాలుగేళ్లుగా 9 అవార్డులు

◆ శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, పనితీరును గుర్తించి గోల్డెన్ పికాక్ అవార్డు అందజేశారు.

◆ 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ఇండియా' ద్వారా ఈ అవార్డులను అందిస్తారు. 2023, 2024 అవార్డులను దుబాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 'ఎస్కీ'కి అందించడం విశేషం.

◆ ఎస్కీకి గోల్డెన్ పికాక్ అవార్డు 2007, 2008 ,2010, 2011, 2012, 2021 ,2022 ,2023, 2024లో పొందడం విశేషం.



గోల్డెన్ పికాక్ అవార్డును స్వీకరిస్తున్న ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు

మరింత గుర్తింపు వచ్చేలా కృషి



'ఎస్కీ' సంస్థలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషి, పనితీరుకు అవార్డు రావడమే నిదర్శనం. నా హయాంలో వరుసగా నాల్గవ ఏడాది కూడా గోల్డెన్ పికాక్ అవార్డును స్వీకరించడం ఎంతో గర్వంగా ఉంది. ఇప్పటి వరకు ఎస్కీ 9 గోల్డెన్ పికాక్ అవార్డులను పొందగలిగింది. రాబోయే రోజుల్లో 'ఎస్కీ'ని మరింతగా అభివృద్ధి చేస్తాం. 9 అవార్డులు రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది.

– డా.రామేశ్వరరావు, డైరెక్టర్ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా

నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం

మాదాపూర్: మారిన జీవనశైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్ల వల్ల చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ క్రమంలో మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉచిత కన్సల్టేషన్ అందిస్తున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9154316236, 040 68334455లలో సంప్రదించగలరు.

సంకీర్తనార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం వైష్ణవి గోపరాజు సంకీర్తనార్చన చేశారు. దేవదేవంభజే, రామచంద్రుడితడు, తలచినవన్నియు, తిరోతిరో, రాజీవనేత్రాయ, నారాయణనమో, గోవిందాశ్రిత గోకుల, నగవులు నిజమని, శరణు కీర్తనలు ఆలపించారు. కీబోర్డు గురుప్రసాద్, మృదంగం రామకృష్ణ, వాయిద్య సహకారాన్ని అందించారు. డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

యోగా పోటీలలో రాణించిన హెచ్‌సీయూ విద్యార్థులు



యోగా పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులు

రాయదుర్గం: యోగా జిల్లా స్థాయి పోటీలలో గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. శనివారం హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో ప్రిన్సిపల్ పి మురళి విద్యార్థులను అభినందించారు. రంగారెడ్డిజిల్లా స్థాయి పోటీలకు ఈ క్యాంపస్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. దీంతో సబ్ జూనియర్ కేటగిరిలో క్యాంపస్ స్కూల్ నుంచి ఆరు మంది విద్యార్థులు పాల్గొనగా వైష్ణవి ద్వితీయ స్థానంతో వెండి పతకం, చందనకు తృతీయ స్థానం కాంస్య పతకం సాధించారు. వారిద్దరు సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనున్నారు.

పేదలకు సాయం చేయడమే లక్ష్యం



మాదాపూర్: పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ తెలిపారు. మాదాపూర్‌లో వార్డు కార్యాలయంలో శనివారం హోప్ ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు మిషన్‌లు, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. కార్మికుల మధ్య కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో లయన్స్, హోప్ సభ్యులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, బర్కు మల్లేష్ యాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో భూ సదస్సు



మాట్లాడుతున్న హైకోర్టు మాజీ జడ్జి, జస్టిస్ చంద్రకుమార్

మియాపూర్: మియాపూర్‌లోని ఎంఏనగర్‌లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక రూపొందించుకున్న రాజ్యాంగంలో ఉత్పత్తి సంపద ఫలాలు ప్రతి పౌరుడు కుల,మత, భాష, లింగ వివక్ష లేకుండా సమానంగా అనుభవించాలని ఉందని తెలిపారు. శ్రమ ఫలితం, శ్రమ జీవులు ఈ ఫలాలను అనుసరించాలని ఉన్నప్పటికి నేటికి పెట్టుబడి దారి వర్గం సంపదను దోపిడీ చేస్తూ జీవిస్తున్నారని ఆరోపించారు. లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్లా సూర్య ప్రకాష్ మాట్లాడుతూ...రాష్ట్రంలో మిగులు భూములు సమస్య అలాగే ఉందన్నారు. పేద ప్రజలు సంవత్సరాల తరబడి ప్రభుత్వ భూమిలో నివాసముంటున్నా ఆ ఇళ్లకు చట్టబద్ధత లేక సమస్యగానే ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ హామీలు అలాగే మిగిలిపోయాయన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో భూ సమస్యపై ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, సుకన్య, సునీల్, తుకారాం, పల్లె మురళి, దశరథ్‌నాక్, కళావతి, పుష్ప, నాయకులు పాల్గొన్నారు.

వీసీకి పుస్తకం అందజేత



పుస్తకాన్ని అందిస్తున్న ప్రొ.రాందాస్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ సీనియర్ ప్రొఫెసర్ రాందాస్ రూపావత్ రచించిన తెలంగాణ రాజకీయ ప్రస్థానం–సామాజిక ఆర్థిక విశ్లేషణ' పుస్తకాన్ని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావుకు శనివారం అందించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వీసీ కార్యాలయంలో ఆయనను కలిసి ఈ పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ 1953 నుంచి 2024 వరకు తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలను పుస్తకంలో పొందపర్చడం జరిగిందన్నారు. ఈ పుస్తకం సివిల్ సర్వీసెస్ పరీక్షలు, గ్రూప్–1 రాసే వారికి ఉపయుక్తం అని ఆయన స్పష్టం చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం కూచిపూడి, భరతనాట్యం, మోహినియట్టం నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ధనీషా ధనపాల్ మోహినియట్టం , ఆషిక షణ్ముగం భరతనాట్య ప్రదర్శన అర్చన గుత్తి శిష్య బృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో బ్రహ్మాంజలి, అదివో అల్లదివో, శివ పంచాక్షరీ కృష్ణ జనన శబ్దం తదితర అంశాలను అర్చన, సహస్ర, వైష్ణవి, సాయిశ్రీ, మానస, శ్రీహిత, కీర్తన, సింధూర, హైందవి, పర్ణిక, సుదీక్ష, వినూత్న, శాన్వి, హారిణి, వర్ష ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు నిర్మలా ప్రభాకర్, గుదిబండి వెంకట్‌రెడ్డి పాల్గొని కళాకారులను అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురికి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. 45 మందికి 18 లక్షల 42 వేల రూపాయలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మాయ బాల నరసింహ, సంపత్‌రెడ్డి, శ్రీకాంత్, మోహన్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

సైబర్ విలేజ్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సైబర్ విలేజ్, సైప్రస్ విల్లాస్, సైబర్ వ్యాలీ, కృష్ణ కాలనీ, శిల్ప పార్కు, మై స్కేప్ శాంక్చ్యురీ కాలనీలలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శనివారం స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి నుంచి వచ్చే వాహనాలు కాలనీల అంతర్గత రోడ్లను ఉపయోగించడం వలన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సైబర్ విలేజ్ నుంచి వచ్చే డ్రైనేజీని శిల్ప పార్కు డ్రైనేజీ పైప్‌లైన్‌కు అనుసంధానం చేయాలన్నారు.



సైబర్ విలేజ్, కృష్ణ కాలనీలలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, కుక్కల బెడద తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో శనివారం ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, డా.సునంద, డా.శ్యామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈనెల 25వ తేదీ వరకు ఇంటింటికి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలోని రామచం ద్రాపురం,భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలలో కార్పొరేటర్‌లు పుష్పనగేష్, వెన్నవరం సింధు పాల్గొన్ని ఫైలేరియా మందులను పంపిణీ చేశారు.

ట్రాఫిక్ సమస్య.. అధికారుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జేఎన్‌టీయూ ప్రధాన రహదారి నుంచి అడ్డగుట్ట, సమతానగర్ మీదుగా ప్రగతినగర్‌కు వెళ్లే దారిలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను శనివారం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాసరావు ట్రాఫిక్ సీఐ వెంకట్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీ రోడ్లలో ఆక్రమణలు తొలగించాలని అధికారులకు సూచించారు. వాటర్‌వర్క్స్, ఎలక్ట్రిసిటీ పనులు జరుగుతున్న సమయాల్లో రోడ్ల తవ్వకాల పూడ్చివేతలపై దృష్టి సారించాలన్నారు. ఇక దుకాణాల ముందు వాహనాలు అడ్డదిడ్డంగా పార్క్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులు, నాయకులు కుమారస్వామి, నిరంజన్ రెడ్డి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

ఆల్విన్‌కాలనీ: టెక్ మహీంద్రా ఫౌండేషన్, నియోకర్సర్ ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో నిరుద్యోగ యువతకు 3 నెలల ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో శిక్షణ ఉంటుందన్నారు. బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీస్, ఇన్స్రూ ఎంఎస్ ఆఫీస్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్ తదితర అంశాలలో శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తయిన అభ్యర్థులకు, 18 నుంచి 28 సంవత్సరాల లోపు వున్న వారికి ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు, మరిన్ని వివరాలకు 7799594242, 9959976231 నంబర్లలో సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 16 ఆఖరు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సువర్ణ భారతి మహోత్సవం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ శంకరమఠం ఆవరణలో సువర్ణ భారతి మహోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీ పరాశర వేద పాఠశాల విద్యార్థులు వేద పారాయణం చేశారు.

సీతారామచంద్రస్వామి కల్యాణ మండపం ప్రారంభం

నిజాంపేట్: నిజాంపేట్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి కల్యాణ మండపాన్ని శనివారం మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్, ఆలయ కమిటీ ఛైర్మన్ ధన్‌రాజ్‌యాదవ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రణయ, మేకల వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, చిట్ల దివాకర్, సుజాత, కో ఆప్షన్ సభ్యులు వీరేష్ ముదిరాజ్, ఏనుగుల అభిషేక్ రెడ్డి, ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్‌లు రాజమోహన్‌రెడ్డి, బైండ్ల నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గచ్చిబౌలి: అంజయ్యనగర్, సిద్ధిఖీనగర్‌లలో శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ పర్యటించారు. మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లడంతో రోడ్లు మురుగుమయంగా మారాయన్నారు. అంతర్గత రోడ్లు పూర్తిగా పాడయ్యాయని, పారిశుద్ధ్యం పనులు సరిగ్గా చేపట్టడంలేదని ఆయన ఆరోపించారు. విద్యుత్ సమస్యలు తలెత్తినా సంబంధిత అధికారులు స్పందించడంలేదన్నారు. కలుషిత నీరు సరఫరా అవుతుందని అధికారులు సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, రాధాకృష్ణ యాదవ్, రవి నాయక్, సంతోష్, సరోజారెడ్డి, కిషన్, బన్సీలాల్, అరవింద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మురుగు సమస్యను పరిశీలిస్తున్న రవికుమార్ యాదవ్

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

- యువతి మృతిపై కుటుంబ సభ్యుల అనుమానం
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న మియాపూర్ పోలీసులు

మియాపూర్: యువతి ఉరేసుకున్న ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం బద్రాక్ జిల్లా బాళేశ్వర్‌కు చెందిన మయ్యాదర్ బారిక్, రాజనీమణి దంపతుల కూతురు గీతాంజలి బారిక్(21) మియాపూర్ మయూరినగర్‌లోని కోరుకొండ కోచింగ్ సెంటర్‌లో 3 సంవత్సరాలుగా సెక్యూరిటీగా పనిచేస్తూ ఉంది. కాగా ఈ నెల 8న గురువారం అర్ధరాత్రి కోరుకొండ సెంటర్‌లో ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని అక్కడి సిబ్బంది మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా కోచింగ్ సెంటర్‌లోని నాల్గవ అంతస్తులోని వాచ్‌మెన్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. అప్పటికే గీతాంజలి మృతి చెందడంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీతాంజలి మృతిపై అనుమానాలు..

గీతాంజలి కుటుంబ సభ్యులు శనివారం కోరుకొండ కోచింగ్ సెంటర్‌కు చేరుకుని తమ బిడ్డను అత్యాచారం చేసి హత్యచేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోచింగ్ సెంటర్ ముందు ధర్నా చేయగా మియాపూర్ పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీన కోచింగ్ సెంటర్‌కు సెలవులు ఇచ్చారని అక్కడ పనిచేస్తున్న వారందరూ ఒడిశాకు చెందిన వారేనని అయితే యువతిని ఒక్కదాన్నే అక్కడ ఉంచారని చెప్పారు. అత్యాచారం చేసి హత్య చేశారని తర్వాత ఉరివేసుకున్నట్లు చిత్రీకరించారని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని హత్య చేశారా లేదా ఆత్మహత్య చేసుకుందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. విచారణలో భాగంగా కోచింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఐదుమంది వాచ్‌మెన్‌లను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.



కోచింగ్ సెంటర్ ముందు బైఠాయించిన కుటుంబ సభ్యులు, బంధువులు



గీతాంజలి (ఫైల్)

కాలుష్య కాసారాలు

- మురికికూపాలుగా చెరువులు
- పట్టించుకోని అధికారులు
- పరిరక్షించాలంటున్న తెల్లాపూర్ వాసులు
- పార్టీలకతీతంగా ఉద్యమానికి ప్రణాళిక

తెల్లాపూర్ పరిధిలోని పలు చెరువులు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు ప్రజలకు తాగు నీరందించిన చెరువులు మానవ తప్పిదాలతో మురుగు కుంటలను తలపిస్తున్నాయి. కాలనీల నుంచి యథేచ్ఛగా మురుగు నీటిని వదులుతుండటంతో చెరువులు కలుషితమై దుర్గంధం వెదజల్లుతున్నాయి.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

తెల్లాపూర్ పరిధిలోని మేళ్ళ చెరువు, వనం చెరువు, చెలికుంటలు మురికి కూపాలుగా మారాయి. కాలనీల నుంచి మురుగంతా చెరువుల్లోకి చేరుతుండటంతో నీరు కలుషితమవుతోంది. చెరువుల పరిరక్షణకు తెల్లాపూర్ ప్రజలు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా పార్టీలకతీతంగా ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

అభివృద్ధే శాపమా..?

రియల్ ఎస్టేట్ పుణ్యమా అని తెల్లాపూర్ ప్రాంతంలోని భూములకు రెక్కలు వచ్చాయి. దీంతో చాలామంది వ్యవసాయ భూములను అమ్ముకున్నారు. అనంతరం అనేక గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. అయితే ఇక్కడి కాలనీల మురుగంతా చెరువుల్లోకి చేరుతుండటంతో నీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేతీరు కొనసాగితే భవిష్యత్‌లో భూగర్భ జలాలు కూడా కలుషితమయ్యే ప్రమాదముందని ఆవేదన చెందుతున్నారు.

ఒకప్పుడు తాగునీటి చెరువులు

తెల్లాపూర్ పరిధిలోని మేళ్ళ చెరువు, వనం చెరువులోని నీటిని తాగేందుకు ఉపయోగించేవాళ్లమని స్థానికులు చెబుతున్నారు. చెరువుల్లో స్వచ్ఛమైన నీరు ఉండేదని అంటున్నారు. అంతేకాకుండా వందలాది ఎకరాల వ్యవసాయ భూమికి సాగు నీరు అందేది. కానీ ఇప్పుడు తెల్లాపూర్ శివారు ప్రాంతమైన శేరిలింగంపల్లి నల్లగండ్ల ప్రాంతానికి చెందిన మురుగునీరు నిత్యం పెద్ద ఎత్తున వనం చెరువులోకి చేరుతుంది. ఓ పక్క చెరువులలో డ్రైనేజీ నీరు దర్శనమిస్తుండగా.. మరోపక్క కబ్జాకు గురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.



మురుగు నీటితో వనం చెరువు

తనిఖీలు ఏవి..?

తెల్లాపూర్ పరిధిలోని గేటెడ్ కాలనీలలో అసలు మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌లు(ఎస్‌టీపీ) పని చేస్తున్నాయా లేదా అని అధికారులు తనిఖీ చేయకపోవడంతోనే చెరువులకు ఈ దుస్థితి ఏర్పడిందని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. అనేక కాలనీలలో ఎస్‌టీపీ ప్లాంట్‌లు పనిచేయకపోవడంతో కాలనీలకు చెందిన మురుగు నీరు చెరువులోకి చేరుతుందని స్థానికులు చెప్పారు. గత రెండేళ్ల క్రితం అధికారులు గేటెడ్ కాలనీలకు ఎస్‌టీపీల విషయంపై నామమాత్రంగా నోటీసులు ఇచ్చి వదిలేశారన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

బోర్లు వేస్తే మురుగునీరు ?

చెరువులలోకి కొన్నేళ్లుగా మురుగు చేరుతుండటంతో భూగర్భ జలాల పరిస్థితిపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బోర్లు వేస్తే మురుగు నీరు వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులలో మురుగు చేరడంపై గతంలో కౌన్సిలర్ భరత్ దీక్ష చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. తాజాగా కొన్నిరోజుల క్రితం తెల్లాపూర్‌వాసులు పార్టీలను పక్కన పెట్టి అందరు కలసి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.